

పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



జాతీయ జెండా ఎగురవేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



బోనాల నృత్యాన్ని ప్రదర్శిస్తున్న బండలనాగపూర్ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు వాయిదా

ఆదిలాబాద్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించనున్న అండర్–17 బాలబాలికల ఖోఖో ఎంపిక పోటీలు అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే నిర్వహించే తేదీలను వెల్లడిస్తామని తెలిపారు. విషయాన్ని జిల్లాలోని క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు గమనించాలని కోరారు.

‘రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి’

ఆదిలాబాద్‌టౌన్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రాష్ట్ర పోలీసులపై చేసిన వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని పోలీసు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక వన్‌టౌన్‌లో రేవంత్‌రెడ్డిపై మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ తమ ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి పోలీసులు పని చేస్తున్నారన్నారు. నిష్పక్షపాతంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులపై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. పోలీసుల మనోభావాలు దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలు బేషరతుగా ఉపసంహరించుకోవాలన్నారు.

ఘనంగా శ్రీకాంత్‌చారి జయంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగురామన్న

ఆదిలాబాద్‌టౌన్: మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంత్‌చారి అని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శ్రీకాంత్‌చారి జయంతిని జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు కిష్టస్వామి, నరసింహులు, స్వామి పాల్గొన్నారు.

తాంసి పీహెచ్‌సీలో ఒకేరోజు ఐదు ప్రసవాలు



శిశువులను చూపుతున్న బంధువులతో వైద్యసిబ్బంది


తాంసి: సాధారణంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు అంటే గర్భిణులు గతంలో భయపడేవారు. ప్రస్తుతం ఆ తీరు మారుతోంది. పీహెచ్‌సీల్లోనూ మెరుగైన వసతులు అందుబాటులోకి రావడంతో ఇక్కడకు వచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు నిదర్శనమే భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. స్వాతంత్య్ర దినోత్సవం రోజున ఈ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది ఐదు సురక్షిత ప్రసవాలు చేశారు. ఈ పీహెచ్‌సీలో ఒకే రోజు ఐదు ప్రసవాలు సమోదవడం ఇదే ప్రథమమని వైద్యాధికారి విజయసారథి పేర్కొన్నారు. పీహెచ్‌సీ సేవలపై మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డివిజన్ ఆకాంక్ష నెరవేర్చండి



మాట్లాడుతున్న సాజిద్‌ఖాన్

బోథ్: బోథ్ డివిజన్ ఆకాంక్ష నెరవేర్చాలని కోరుతూ మండలకేంద్రంలో చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. స్వాతంత్య్ర దినోత్సవం రోజున పంజేషా కాలనీ యువకులు దీక్షలో కూర్చున్నారు. వీరికి డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్‌తో పాటు మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థులు మంగళవారం సంఘీభావం ప్రకటించారు.



మద్దతు తెలుపుతున్న విద్యార్థులు



మాట్లాడుతున్న విప్ గోవర్ధన్

అభివృద్ధి.. సంక్షేమం

- ప్రగతిపథంలో జిల్లా..
- అందుబాటులోకి అత్యాధునిక వైద్యసేవలు
- సర్కారు బడుల్లో కార్పొరేట్ స్థాయి విద్య
- త్వరలోనే కొరటా–చనాఖా నుంచి సాగునీరు
- జిల్లా కేంద్రంలో ఆరు వరుసల రహదారి అభివృద్ధి
- పంద్రాగస్టు వేడుకల్లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



బోనాల నృత్య ప్రదర్శనలో విద్యార్థిని

పట్టణ ప్రగతిలో అభివృద్ధి..
హరితహారంలో భాగంగా అటవీశాఖ ద్వారా 45లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 35.14 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. పట్టణ ప్రగతిలో భాగంగా ఇప్పటి వరకు రూ.31.32 కోట్లతో 200 పనులకు పైగా చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి హామీ, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్, ఎల్‌ఆర్‌ఎస్ నిధుల ద్వారా రూ.15.6 కోట్లతో డంపింగ్ యార్డ్, సీసీ రోడ్లు, గ్రంథాలయ నిర్మాణం, చెత్త సేకరణ, శాస్త్రీయ పద్ధతిలో రవాణా చేసేందుకు 46 వాహనాలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. పట్టణ అవసరాల నిమిత్తం రూ.50 లక్షలతో స్వీపింగ్ యంత్రం, రూ.25లక్షలతో జేసీబీలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. పట్టణంలో రూ.1,123 లక్షలతో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం, మొబైల్ మరుగుదొడ్డి, ఓపెన్ జిమ్‌లు, పార్కుల ఏర్పాటు, బృహత్ పట్టణ ప్రకృతి వనాలు, స్వాగత ఆర్చ్, జంక్షన్ల అభివృద్ధి, హైమాస్ లైట్లు, సెంట్రల్ మీడియన్‌లో మొక్కల పెంపకం, వైకుంఠ రథాల కొనుగోలు, వైకుంఠధామాల అభివృద్ధి, తదితర పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. రూ.16.90 కోట్లతో ఐదు కూడళ్ల అభివృద్ధి పనులు, గోశాల, కమాండ్ కంట్రోల్ రూం, సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం, మరో మూడు వైకుంఠధామాల అభివృద్ధి పనులతో పాటు రూ.2 కోట్లతో మూడు చౌక్‌ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు.

సాక్షి,ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఆదిలాబాద్ జిల్లా ప్రగతిపథంలో ముందుకు సాగుతుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం జాతీయ జెండా ఆవిష్కరించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావు, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాను ప్రగతి పథంలో తీసుకెళ్లడానికి అహర్నిశలు, అంకితభావంతో కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగంతో పాటు వివిధ సంస్థలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా జాతీయ జెండా ఆవిష్కరించి, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు. చివరగా స్టాళ్లను సందర్శించారు.

రైతులకు చేయూత..
జిల్లా రైతులకు కొరటా–చనాఖా బ్యారేజ్ ద్వారా ఈ ఏడాది చివరి నాటికి 20వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. రైతుబంధు పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో పట్టాదారు పుస్తకాలు, అటవీ హక్కు పత్రాలు కలిగిన లక్షా 34,606 మందికి రూ.191కోట్లు అందించినట్లు చెప్పారు. వివిధ కారణాలతో మరణించిన 531 మంది రైతు కుటుంబాలకు రైతు బీమా కింద రూ.5లక్షల చొప్పున రూ.26.55 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ పథకం కింద 3,597 గొర్రెల యూనిట్లు సరఫరాకు సిద్ధంగా ఉండగా, 138 యూనిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

వైద్యారోగ్య శాఖ..
సాధారణ ప్రసవాల సంఖ్య పెంచడంతో రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన 40,496 మంది బాలింతలకు కేసీఆర్ కిట్లతో పాటు రూ.8.67 కోట్ల నగదు వారి ఖాతాల్లో జమచేసినట్లు చెప్పారు. గర్భిణుల్లో రక్తహీనత నియంత్రణ కోసం 7,814 న్యూట్రిషన్ కిట్లను అందజేసినట్లు తెలిపారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం మహిళలకు 8 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ఎంఆర్ఐ యూనిట్ ఏర్పాటుకు రూ.11.65 కోట్లు, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి రూ.40 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే 220 పడకల సామర్థ్యంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 8 రకాల అత్యాధునిక వైద్య సేవలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

ఈజీఎస్..
జిల్లాలో బ్యాంక్ లింకేజీ పథకం కింద 34,208 మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.1,065 కోట్లు, స్త్రీనిధి కింద రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే జాతీయ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో లక్ష 21వేల మంది కూలీలకు ఉపాధి కల్పించినట్లు చెప్పారు. రూ.63.79 కోట్లతో ప్రతి గ్రామపంచాయతీలో వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్లు, వ్యవసాయ కల్లాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతో పాటు నర్సరీల్లో 4.68 కోట్ల మొక్కలు పెంచినట్లు తెలిపారు.

సంక్షేమానికి పెద్దపీట
జిల్లాలో అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ, కల్లుగీత కార్మికులైన 75,621 మందికి రూ.15.96 కోట్ల ఆసరా పింఛన్లను ప్రతీనెల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 31,683 ఎకరాల పోడు భూములకు గాను 12,222 మందికి అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేశామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు జిల్లాలో 27,941 కుటుంబాలకు రూ.248.76 కోట్ల విలువ గల చెక్కులను అందించినట్లు తెలిపారు. బీసీలకు రూ.లక్ష చొప్పున జిల్లాలో ఇప్పటివరకు 600 మందికి రూ.6 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. దళితబంధు పథకం కింద నిరుపేద ఎస్సీ కుటుంబాలకు రూ.10లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని, తొలివిడతలో 249 కుటుంబాలకు రూ.24.65 కోట్లతో వివిధ యూనిట్లను అందించినట్లు తెలిపారు. భూమి కొనుగోలు పథకం కింద 1883 మంది నిరుపేద దళిత కుటుంబాలకు 4,787 ఎకరాల భూమిని పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మత్స్య కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మత్స్య అభివృద్ధి పథకం కింద ఈ ఏడాది చెరువులు, జలాశయాల్లో 123.25 లక్షల చేప పిల్లలు పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సీఎం గిరివికాస పథకం కింద 459 మంది లబ్ధిదారులకు రూ.5.65 కోట్లతో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు.

మన ఊరు–మనబడి కింద అభివృద్ధి..
జిల్లాలో ఈ విద్యా సంవత్సరం ఆయా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఇప్పటి వరకు 5.25 లక్షల పాఠ్యపుస్తకాలు, 3.34 లక్షల నోటుబుక్‌లను పంపిణీ చేశామని తెలిపారు. మన ఊరు–మనబడి కింద జిల్లాలో 237 పాఠశాలలకు సుమారు రూ.26.16 కోట్లతో పాలన అనుమతులు మంజూరై వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

ఆరు వరుసల రహదారి..
జిల్లాలో రూ.75.96 కోట్లతో రోడ్ల అభివృద్ధి, పునరుద్ధరణ, వంతెనలు నిర్మించడం వంటి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో ఆరు వరుసల రహదారి అభివృద్ధి కోసం రూ.57.94 కోట్లతో పనులు సాగుతున్నాయని, ఉండం–ఆదిలాబాద్ స్టేషన్ల మధ్య రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జీల నిర్మాణం కోసం రూ.97.20 కోట్ల నిధులు, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నిర్మాణానికి రూ.55 కోట్ల నిధులతో పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. పంచాయితీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా గ్రామాలకు రవాణ సౌకర్యం కల్పించడానికి రూ.38.26 కోట్లతో ఏడు రోడ్ల పనులు, రూ.25.37 కోట్లతో ఏడు బ్రిడ్జి పనులు చేపట్టామన్నారు. అలాగే రూ.20.20 కోట్లతో 101 నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు.



ఆర్మీ జవాన్ల పరిస్థితి అద్దం పట్టే నృత్య ప్రదర్శన



ఆదివాసీ సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఆదిలాబాద్: అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కేజీబీవీ ఆదిలాబాద్ అర్బన్ విద్యార్థినులు మేరే వతన్ అనే గీతంపై నర్తించారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ ఆదిలాబాద్‌కు చెందిన విద్యార్థినులు వ్యవసాయం ప్రాముఖ్యతను తెలిపేలా నృత్యం చేశారు. బోనాల నృత్యాన్ని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల (బాలికల) బండల నాగపూర్‌కు చెందిన చిన్నారులు అలరించారు. ఆశ్రమ ఉన్నత పాఠశాల కేస్లాపూర్ విద్యార్థులు ఆదివాసీ వివాహ మహోత్సవ ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించడమే కాకుండా సైనిక అమరవీరుల త్యాగాలను స్మరించుకునేలా అద్భుత ప్రదర్శన చేశారు. అనంతరం ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంస పత్రాలు అందజేశారు.

ఆకట్టుకున్న స్టాళ్లు



స్టాళ్లను తిలకిస్తున్న ప్రభుత్వ విప్ గోవర్ధన్, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్: వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 12 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల విభాగం స్టాల్‌లో ఓటు హక్కు ప్రాముఖ్యత, ఈవీఎం పనితీరును వివరించారు. విద్యాశాఖలో పలువురు విద్యార్థులు తయారుచేసిన నూతన ఆవిష్కరణలు ప్రదర్శించారు.

పంద్రాగస్టు సంబరాలు..

కైలాస్‌నగర్/ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, ఎస్పీ క్యాంపు కార్యాలయాల్లో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్లు కుష్బూగుప్తా, శ్యామలాదేవి, డీఎస్‌వో కిరణ్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా పరిషత్‌లో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి త్రివర్ణ పతకాన్ని ఎగురవేశారు. సీఈవో గణపతి, డిప్యూటీ సీఈవో రాథోడ్ రాజేశ్వర్ పాల్గొన్నారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



జెండా వందనం చేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జాతీయ పతాకం ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్రోద్యమంలో మహనీయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన

ఆదిలాబాద్: స్వాతంత్య్ర సంబరాల వేళ సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం తమ నిరసన వ్యక్తం చేశారు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కుమరంభీమ్ చౌక్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ‘సీఎం కేసీఆర్ గారు న్యాయం చేయండి’ అంటూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



కుమురంభీం చౌక్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇదే..

క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న సప్తగిరి



అమ్మవారి ఆలయంలో సప్తగిరి

భైంసా: బాసర సరస్వతి అమ్మవారిని సినీ కమెడీయన్ సప్తగిరి దర్శించుకున్నారు. మంగళవారం బాసర చేరుకున్న ఆయన ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని మొక్కుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానికులు అతడితో సెల్ఫీలు తీసుకున్నారు.

2వ బెటాలియన్‌లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు



సేవా పతకాన్ని అందిస్తున్న కమాండెంట్ చటర్జీ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ శివారు ప్రాంతంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 2వ బెటాలియన్‌లో మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ చటర్జీ జాతీయ జెండాను ఎగురవేశారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది సేవలను గుర్తించిన ప్రభుత్వం అసిస్టెంట్ కమాండెంట్ కేవీవీ ప్రసాద్, హెచ్‌సీ ఎం.రమేష్‌కు ఉత్కృష్ట, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ లింగ్యా నాయక్‌కు అతిఉత్కృష్ట సేవా పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుల పోరాటబలం, అమరవీరుల త్యాగఫలం, బ్రిటీష్ పాలకులపై తిరుగులేని విజయమే స్వాతంత్య్ర దినోత్సవం అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎం.జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్ పాణి, పి.క్రిష్ణ ప్రసాద్, కె.అప్పాయ్యరావ్ ఉన్నారు.

వెడ్మ భొజ్జుపై ఫిర్యాదు

ఉట్నూర్‌రూరల్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉట్నూర్ పాత బస్టాండ్ వద్ద జాతీయ జెండాను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి మల్లారెడ్డి ఆవిష్కరణ చేస్తున్న సమయంలో అతడిని అడ్డుకోవడంపై అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ పేర్కొన్నారు. జెండా ఆవిష్కరణ సమయంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ తన అనుచరులతో చేరుకొని జెండా ఎగురవేస్తున్న మల్లారెడ్డిని అడ్డుకొని ఖయ్యుంతో జెండా ఆవిష్కరణ చేయించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ పుర్కబాపురావు, గిరిజన నాయకులు పెందూర్ ప్రభాకర్, ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ కొమ్ము విజయ్, లింగంపల్లి చంద్రయ్య, ఎక్బాల్‌లు తీవ్రంగా ఖండిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్‌తో పాటు రాష్ట్ర, కేంద్ర కాంగ్రెస్ అధిష్టానాలకు ఫిర్యాదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆమె వెంట నాయకులు కలీం, ప్రేం, సోయల్ ఉన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన ఎండీ బిలాల్(22) కనిపించడం లేదని తండ్రి ఎండీ మూసా ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... స్థానికంగా చికెన్ సెంటర్ నడిపే బిలాల్ సోమవారం నిర్మల్ వెళ్లి వస్తానని చెప్పి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. నిర్మల్‌లో తన స్నేహితుడికి ద్విచక్ర వాహనం అప్పగించి ఇంటికి తీసుకెళ్లాలని చెప్పి నిజామాబాద్ వెళ్తున్నట్లు చెప్పాడు. ఆతర్వాత ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులు వీరే...



ప్రశంసా పత్రం అందుకుంటున్న రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుమలత

కైలాస్‌నగర్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, విశిష్ట సేవలందించిన పలువురు అధికారులు, ఉద్యోగులకు స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా యంత్రాంగం గుర్తింపునిచ్చింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ వారికి ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. అవార్డులను అందుకున్న ఉత్తమ ఉద్యోగుల వివరాలివి.



డి.రాధిక, ఎస్సై, బేల | బి.ఆశన్న, జూనియర్ అసిస్టెంట్, డీపీవో, ఆదిలాబాద్ | జాకీర్‌అలీ, హెడ్‌కానిస్టేబుల్, సీసీఎస్, ఆదిలాబాద్ | పి.సుజాత, హెడ్‌కానిస్టేబుల్, జైనథ్ | సాయి, ఏఆర్, పీసీ, ఆదిలాబాద్



బి.క్రిష్ణ, హెడ్‌కానిస్టేబుల్, ఇంటిలిజెన్స్ | చంద్రశేఖర్, కానిస్టేబుల్, ఇంటిలిజెన్స్ | బి.దేవిసింగ్, ఆర్‌ఐ, యాపల్‌గూడ | బి.గులాబ్‌సింగ్, ఎఫ్‌ఆర్‌వో, ఆదిలాబాద్ | ఏ.మల్లయ్య, ఏఎస్సై, టీఎస్ఎస్‌పీ | పి.అఖిలేష్, న్యాయవాది, ఆదిలాబాద్ | శ్రీధర్ చౌహాన్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ | సత్యనారాయణ, సూపరింటెండెంట్ | డి.శ్రీవాణి, నాయబ్ తహసీల్దార్, కలెక్టరేట్ | ఆర్.శ్రీదేవి, లెక్చరర్, నర్సింగ్ కళాశాల | యు.మమత, టెక్నికల్ ఆఫీసర్, మున్సిపల్



ఎన్.భాస్కర్, వాచ్‌మెన్, ఆర్‌అండ్‌బీ | జి.ప్రదీప్‌కుమార్‌గౌడ్, ఎంవీఐ, ఆదిలాబాద్ | ఎస్‌కే.యూసుఫ్, ఆర్టీసీ డ్రైవర్ | బండి రవి, ఈడీఎం, కలెక్టరేట్ | ఉస్మాన్, ఆఫీస్ సబార్డినేట్ | సునీల్, ఎస్సై, ఇంద్రవెల్లి | యు.రాఘవేందర్, ఏటీవో, ట్రెజరీశాఖ | బి.ప్రభాకర్, ఆర్టీసీ కండక్టర్, ఆదిలాబాద్ | పి.శేఖన్న, ఆఫీస్ సబార్డినేట్ | టి.పుష్పలత, ఎంపీడీవో, ఇంద్రవెల్లి | ఎండీ.సలీం, జూనియర్ అసిస్టెంట్, పీఆర్



బి.వెంకటేశ్వర్లు, ఏఈఈ, మిషన్ భగీరథ | మడావి ఉర్మిళ, డొంగర్‌గాంవ్, పిట్టబొంగరం | సురేష్ చౌహాన్, ఫీల్డ్ మెన్, మత్స్యశాఖ | మేఘశ్యాంరెడ్డి, ఈఎంటీ, ఈఎంఆర్‌ఐ | సంగీత, టెక్నికల్ అసిస్టెంట్, జైనథ్ | ఈ.సునీల్‌కుమార్, డీఈవో | విజయ్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ | ఎన్.సంజీవ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ | కె.రాంబాబు, మెడికల్ ఆఫీసర్, నార్నూర్ | కె.క్రాంతికుమార్, ఏటీడబ్ల్యూవో, ఉట్నూర్ | ఏ.దేవిదాస్, ఏఎస్సై, ఇంటిలిజెన్స్

గిరిజనుల అభివృద్ధికి నిరంతర కృషి

- ఐటీడీఏలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు
- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



జెండావిష్కరిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఎందరో మహనీయులు త్యాగాల ఫలితమే ఈ స్వాతంత్య్రమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో పీవో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించి జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐటీడీఏ ద్వారా గిరిజన ఆదివాసీలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. విద్య విభాగంలో 917 ప్రాథమిక పాఠశాలల్లో 12,214 విద్యార్థులు ఉండగా 681 ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు వివరించారు. 133 ఆశ్రమ పాఠశాలల్లో 30,478 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. మహిళా శిశు సంక్షేమ విభాగంలో ఐటీడీఏ పరిధిలోని పీవీటీజీ గ్రామాల్లో గిరి పోషణ కార్యక్రమం ప్రారంభించామని, ఇందులో భాగంగా 12,371 గర్భిణులకు, బాలింతలకు, 2-6 ఏళ్ల పిల్లలకు ఆరు రకాల పోషణ ఆహార పదార్థాలు ఇక్రిశాట్, ఐటీడీఏ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇస్తున్నామన్నారు. ఆరు నెలల నుంచి 59 నెలల తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లల ఆరోగ్యం మెరుగుపర్చడం కోసం బాలామృతం పంపిణీకి ఎస్ఎస్ఎఫ్‌పీ ప్రోగ్రాం ద్వారా పైలట్ ప్రాజెక్టుగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రారంభించినట్లు తెలిపారు. వైద్యారోగ్యం విభాగంలో అదనపు జిల్లా, ఆరోగ్య శాఖాధికారి పరిధిలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 186 ఉప ఆరోగ్య కేంద్రాలు, ఆరు సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఆరోగ్య సేవలు అందిస్తున్నాయన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో మౌలిక సదుపాయల కోసం ఐటీడీఏ జిల్లాల రోడ్ల పథకం కింద 322 తార్‌రోడ్ల నిర్మాణానికి 38,999 లక్షల అంచనాలతో మంజూరు చేసినట్లు తెలిపారు. ఎస్‌టీఎస్‌డీఎఫ్ పథకంలో రూ.45.80 కోట్ల అంచనా విలువలతో 229 గిరిజన గ్రామపంచాయతీ భవన నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 కింద జిల్లాలోని 50 మండలాల్లో 499 అటవీ హక్కు కమిటీలను ఏర్పాటు చేసి మొదటి దశలో 37324 మందికి, రెండవ దశలో 37136 మందికి హక్కులు కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు, ఎంపీపీ జైవంత్‌రావు, జెడ్పీటీసీ చారులత రాథోడ్, డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీ ఎంఅండ్‌హెచ్‌వో కుడ్మ బాలు, ఏఓ రాంబాబు, ఏపీవోపీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్సీఓ గంగాధర్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా



విశాల్ మృతదేహం

సిరికొండ: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణాలు తీసింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని పొన్న గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం... సునీత నాందేవ్ దంపతుల కుమారుడు కేంద్రే విశాల్ (14) ఇచ్చోడ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు వెళ్లిన విశాల్ వేడుకలు ముగిసిన వెంటనే తిరిగి ఇంటికి చేరుకున్నాడు. మధ్యాహ్నం సమయంలో సరదాగా ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని పంట చేనులోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావిలో దూకిన విశాల్ పైకి రాకపోవడంతో తోటి స్నేహితులు భయాందోళనకు గురై గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు బావి వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో రాత్రి విశాల్ మృతదేహం బయటపడింది.

బస్సు-బైక్ ఢీ, యువకుడి మృతి



బస్సును ఢీకొట్టిన బైక్



హరీశ్ మృతదేహం

నిర్మల్: ఓ వైపు పంద్రాగస్టు వేడుకలు ఘనంగా సాగుతుండగా, మరోవైపు నిండుప్రాణం రోడ్డు ప్రమాదం పాలైంది. జిల్లా కేంద్రంలోని డాక్టర్స్‌లైన్‌లో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం ధన్నూర్‌కు చెందిన రాజారం హరీశ్(25), అదే మండలం కుచులాపూర్, ఇచ్చోడ మండలం పిప్రిలకు చెందిన గంగయ్య, పవన్‌లు స్థానిక ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారు. ముగ్గురూ కలిసి ఒకే బైక్‌పై బస్టాండ్ వైపు బయలుదేరారు. డాక్టర్స్‌లైన్‌లోని ట్రెండ్స్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆదిలాబాద్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సును ఢీకొట్టారు. ఈ ఘటనలో హరీశ్ మృతిచెందగా, గంగయ్య, పవన్‌లకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ ఎదురుగా వెళ్తున్న పంద్రాగస్టు ర్యాలీ వెళ్తుండగా దానిని తప్పించుకుని వెళ్లేందుకు రాంగ్‌రూట్లో బస్సు రావడం, ఒకే బైక్‌పై వెళ్తున్న ముగ్గురూ స్పీడ్‌గా ఉండటం, ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో స్వాతంత్య్ర వేడుకలు



మాట్లాడుతున్న ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ





ట్రిపుల్‌ఐటీలో నృత్య విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భైంసా: బాసరలోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లోని శాతవాహన గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ హాజరై జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయుల పోరాటాలతో బ్రిటిష్ వారిని ఎదిరించి స్వాతంత్య్రం సాధించుకున్నామని తెలిపారు. బాసర ట్రిపుల్‌ఐటీ పురోగతిని సాధిస్తుందని తెలిపారు. దాదాపుగా రూ.80కోట్లు వెచ్చించామని, విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పిస్తూనే నాణ్యమైన విద్యను అందజేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి సృజనాత్మకత వైపు పయనించాలని, అందుకు ఇన్నోవేషన్ ట్రిపుల్‌ఐటీ పేరిట ఈ మధ్య కాలంలోనే ఐటీ హబ్ నిజామాబాద్‌లో క్యాంపస్ కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థిని లహరి విదేశంలో ఇంటర్నేషనల్ యునైటెడ్ నేషన్స్ 12వ కాన్ఫరెన్సుకు హాజరై ప్రసంగించడం ఎంతో అభినందించదగిన విషయమని కొనియాడారు. పీయూసీ-2 చదువుతున్న విద్యార్థి శ్రీపాదరెడ్డి నూతన ఆవిష్కరణలకు తావిస్తూ డ్రోన్ తయారు చేయడం, దాని ఖర్చు రూ.40వేలను విశ్వవిద్యాలయం అందించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది, రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది చేసిన పెరేడ్, పిరమిడ్ విన్యాసాలు చూపరులకు కనువిందు చేశాయి. కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్ సృజన, డాక్టర్ నాగసాయి, ఫైనాన్స్ అధికారి అనిల్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ కో–ఆర్డినేటర్ దావులు, సీఓఈ డాక్టర్ వినోద్, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్, ప్రభాకర్, పీడీ శ్యాంబాబు పాల్గొన్నారు.

జెండాపండగను మరిచిన ఉపాధ్యాయులు

- పాఠశాలకు వచ్చి నిరాశతో వెనుదిరిగిన విద్యార్థులు



స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు కాని పాఠశాల

నేరడిగొండ: 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా అన్ని పాఠశాలలు విద్యార్థులతో కిటకిటలాడుతుంటే.. మండలంలోని తేజాపూర్ ప్రాథమిక పాఠశాల పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా కనిపించింది. ఈ పాఠశాల ఉపాధ్యాయులు ఏకంగా జెండా పండగ మరిచారు. ఈ పాఠశాలలో 45 మంది విద్యార్థులకు గాను ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయుడు, వీవీలు ఉన్నారు. వీరిలో ఎవరుకూడా రాకపోవడంతో ఎంతో ఉత్సాహంగా పాఠశాలకు వచ్చిన విద్యార్థులు నిరాశతో వెనుదిరగాల్సిన దుస్థితి నెలకొంది. వేడుకల సందర్భంగా కనీసం పాఠశాలను ముస్తాబు కూడా చేయలేదని, ఈ విషయమై పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌కు ఎలాంటి సమాచారం లేకపోగా, పాఠశాలలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిలిచిపోయింది. ఉపాధ్యాయులు ఎవరు లేకపోయినా ఎంఈఓ పరిధిలోని ఎమ్మార్సీ సిబ్బంది ద్వారా జెండా ఆవిష్కరణ చేయాల్సి ఉంటుందని, అది కూడా చేయకుండా పూర్తిగా జెండా పండుగను నిర్లక్ష్యం చేశారని విద్యార్థుల పోషకులు పేర్కొంటున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి సంబంధిత మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా అనారోగ్య సమస్యలతో పాఠశాలకు రాలేకపోయామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

కత్తులతో వీరంగం

- ఇద్దరికి స్వల్ప గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: మద్యం మత్తులో ముగ్గురు యువకులు కత్తులతో మంగళవారం వీరంగం సృష్టించారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన ఓ వ్యక్తి కోలిపుర చౌరస్తాలో ఐచర్ వాహనాన్ని గత కొన్ని రోజులుగా రోడ్డుపై నిలుపుతున్నాడు. దీంతో ఆ కాలనీకి చెందిన నరేష్ అనే వ్యక్తి ఐచర్ వాహన యజమానితో రోడ్డుపై వాహనం నిలపడంతో అటువైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించడం లేదని, పిల్లలు ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాహనాన్ని మరో చోట పార్కింగ్ చేయాలని సూచించాడు. దీంతో ఐచర్ యజమాని ఆయనతో దుర్భాషలాడి అక్కడినుంచి వెళ్లిపోయాడు. తన స్నేహితులు మరో ఇద్దరిని వెంటపెట్టుకొని వచ్చాడు. అందులో ఓ వ్యక్తి కత్తితో నరేష్ అతడి మిత్రుడు రవికాంత్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో వారిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఇరువర్గాలకు చెందిన వారు గుమిగూడారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు అక్కడికి చేరుకుని ఇటీవల కాలంలో హిందువులపై దాడులు పెరిగిపోతున్నాయని, కత్తితో దాడిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాడు.
బాధితులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ సత్యనారాయణను సంప్రదించగా.. కత్తులతో దాడిజరిగిన సంఘటన గురించి వివరించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.